www.prajaswaramdaily.com

# ప్రజాస్వరం

PRAJASWARAM

తెలుగు దినపత్రిక

మెదక్ | సంపుటి : 17 | సంచిక : 310 | పేజీలు : 5 | వెల : 1

Circulated By : Hyderabad- Medak - Sangareddy - Nalgonda - Warangal - Nizamabad- Vijayawada- Guntur - Vizag - Adilabad- kurnool | శనివారం 20-07-2024

MHR TV

www. mhrtv.com

## బండీ.. రాజీనామా చేస్తావా..?



- 70 శాతం మంది రైతులకు రుణమాఫీ వర్తించలేదనడం విడ్డూరం
- నిరూపించలేకపోతే పదవి నుంచి వైదొలగాలి
- వెంటనే రైతులకు క్షమాపణలు చెప్పాలి
- నల్ల చట్టాలు తెచ్చి అన్నదాలను పొట్టన పెట్టుకున్న చరిత్ర మీది
- కేంద్ర నుంచి రాష్ట్రానికి ఏం తెస్తారో చెప్పండి
- రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆగ్రహం

| 2

## నేడు నీట్ యూజీ ఫలితాలు





- మధ్యాహ్నం కల్లా జాబితా వెబ్ సైట్‌లో పెట్టాలి
- ఎన్‌టీఏకి సుప్రీం ఆదేశం
- విద్యార్థుల గుర్తింపు గోప్యంగా ఉంచాలని సూచన
- లీకేజీ అవకతవకలపై తిరిగి 22న విచారణ
- అదే రోజు తీర్పు వెలువడే అవకాశం

**న్యూఢిల్లీ, జూలై 19 :** నీట్ –యూజీ పేపర్ లీకేజీ, పరీక్ష నిర్వహణలో అవకతవకలపై భారత సర్వోన్నత న్యాయస్థానం జూలై 18న పిటిషన్లను విచారించింది. పరీక్ష కేంద్రం, నగరాల వారీగా అభ్యర్థుల మార్కులకు సంబంధించిన ఫలితాలు ప్రకటించాలని ఎన్ టీఏను ఆదేశించింది. జూలై 20వ తేదీ (నేడు) మధ్యాహ్నం 12 గంటలలోపు మార్కుల జాబితాను వెబ్ సైట్ లో అందుబాటులో ఉంచాలని పేర్కొంది. పరీక్ష ప్రక్రియ, సమగ్రతను పారదర్శకతను నిర్ధారించడానికి కేంద్రాల వారీగా మార్కుల నమూనాలను వెల్లడించాలని, అయితే విద్యార్థుల గుర్తింపును గోప్యంగా ఉంచాలని ధర్మాసనం సూచించింది. 'నీట్ – యూజీ' సంబంధిత పిటిషన్ లను జూలై 22న తిరిగి విచారిస్తామని సుప్రీం కోర్టు పేర్కొంది. విచారణ సందర్భంగా సీజేఐ చంద్రచూడ్ గత 3 సంవత్సరాలుగా నీట్ పరీక్ష రాసిన విద్యార్థుల సంఖ్య, ఉత్తీర్ణత వివరాలపై **మిగతా 2 లో..**



# తాకట్టుకు 400 ఎకరాలు!

## రుణమాఫీ నిధుల సమీకరణకు సర్కారు కసరత్తు

### నెల రోజుల్లో రూ.24 వేల కోట్లు సేకరించేలా ప్రణాళికలు

- ఆగస్టు 15లోగా మొత్తం మాఫీ చేస్తామని సీఎం హామీ
- కోకాపేట, రాయదుర్గంలో అత్యంత విలువైన భూములు
- ఎకరానికి గరిష్టంగా రూ. 50 కోట్ల విలువ
- కనీసం పదివేల కోట్ల రుణమైనా దొరుకుందని అంచనా
- మర్చంట్ బ్యాంక్ కోసం టెండర్ ప్రకటన!
- సోషల్ స్టాంక్ ఎక్స్ఛేంజ్ విధానాన్నీ వినియోగించుకోవాలని యోచన

**హైదరాబాద్, జూలై 19, (ప్రజాస్వరం):** పంట రుణమాఫీని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని గురువారం లక్ష లోపు రుణాలను మాఫీచేసింది. ఇందుకోసం రూ7 వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమచేసింది. అయితే, మొత్తం 2 లక్షల వరకు రుణమాఫీ చేయాలంటే ఇంకా రూ. 24వేల కోట్లు అవసరం. నెలాఖరులో లక్షన్నర.. ఆగస్టు పదిహేనులోపు రెండు లక్షల రుణమాఫీ పూర్తి చేస్తామని చెబుతున్నారు. అంటే.. మరో నెల రోజుల్లోనే రూ. 24 వేల కోట్లను సమీకరించాల్సి ఉంది. దీనికి తగ్గ ప్రణాళికను ప్రభుత్వం సిద్ధం చేసుకుందని తెలుస్తోంది. ఆర్‌బీఐ నుంచి ప్రతి మంగళవారం తీసుకునే వెసులుబాటు ఉన్న రుణాలతో పాటు భూములను తాకట్టు పెట్టాలన్న ఆలోచనలో చేస్తున్నట్టు సమాచారం. ఇందుకోసం అంతర్గతంగా ప్రక్రియ జరిగిపోతున్నదని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. తెలంగాణ ప్రభుత్వానికి ఉన్న అత్యంత విలువైన ఆదాయ వనరు భూములు. ఐటీ కారిడార్, ఔటర్ రింగ్ రోడ్ పక్కన ఖరీదైన భూములు ఉన్నాయి. వాటిలో అత్యంత విలువైన సుమారు 400 ఎకరాల భూములను ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలకు తాకట్టు పెట్టేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నట్టు ఇప్పటికే ప్రచారం జరుగుతోంది. కోకాపేట, రాయదుర్గంలో ఉన్న ఈ భూముల విలువ బహిరంగ మార్కెట్ లో రూ. 20వేల కోట్లు ఉంటుందని అంచనా. వీటిని తాకట్టు పెట్టేందుకు ఓ మర్చంట్ బ్యాంక్ కోసం టెండర్ ప్రకటన కూడా ఇచ్చినట్లు సమాచారం. ఒక్కో ఎకరానికి గరిష్టంగా రూ. 50 కోట్లు చొప్పున 400 ఎకరాల విలువను 20వేల కోట్లుగా నిర్ణయించారు. కనీసం పదివేల కోట్లు అయిన రుణం అందుతుందని అంచనా వేస్తున్నారు. ఇలా భూములు తాకట్టు పెట్టడంపై కేటీఆర్ ట్విట్టర్ వేదికగా విమర్శలు చేసినా ప్రభుత్వం **మిగతా 2 లో..**

విలేకరులు కావలెను

ప్రజాస్వరం



పదిహేడు సంవత్సరాలుగా జర్నలిజం రంగంలో విశిష్ట సేవలందిస్తూ అత్యంత ప్రజాదరణ పొందిన ప్రజాస్వరం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో జిల్లా స్టాఫర్లు, నియోజకవర్గ ఇన్ చార్జిలు, మండల రిపోర్టర్లు కావలెను.

సెల్ : 800 860 9999

## గ్రూప్ - 2 వాయిదా





- డీఎస్సీ పరీక్షలతో సమయం సరిపోదని అభ్యర్థుల ఆందోళనలు
- పోస్టుల సంఖ్యనూ పెంచాలని డిమాండ్
- ఎట్టకేలకు దిగివచ్చిన రేవంత్ సర్కార్
- డిసెంబర్‌లో నిర్వహిస్తామని ప్రకటన
- త్వరలోనే తేదీలను వెల్లడిస్తామన్న అధికారులు

**హైదరాబాద్, జూలై 19 (ప్రజాస్వరం):** తెలంగాణలో నిరుద్యోగుల ఆందోళనతో గ్రూప్ – 2 పరీక్ష వాయిదా పడింది. డిసెంబర్ కు పరీక్ష వాయిదా వేస్తున్నట్లు ప్రభుత్వం శుక్రవారం మధ్యాహ్నం అధికారికంగా ప్రకటించింది. షెడ్యూల్ ప్రకారం ఆగస్టు 7, 8 తేదీల్లో పరీక్ష జరగాల్సి ఉంది. అయితే, డీఎస్సీ పరీక్షల నేపథ్యంలో గ్రూప్ – 2 వాయిదా వేయాలని నిరుద్యోగులు కొద్ది రోజులుగా ఆందోళనలు చేపట్టారు. తమకు ప్రిపరేషన్‌కు సమయం లేదని వాదించారు. కానీ, ఇప్పటికే పలుమార్లు వాయిదా పడ్డ పరీక్షను ఎలాగైనా నిర్వహించాలని ప్రభుత్వం తొలుత భావించింది. నిరుద్యోగుల ఆందోళనలు ఉధృతం కావడంతో సర్కారు వాయిదాపై సానుకూలంగా స్పందించి ఉత్తర్వులు జారీ చేసింది. **మిగతా 2 లో..**

## సీఎం అమెరికా పర్యటన

వచ్చే నెల 3 నుంచి 11 వ తేదీ వరకు షెడ్యూల్ | 2



## ఆయిల్ పామ్‌ను ప్రోత్సహించాలి


- దేశానికి 100 లక్షల మెట్రిక్ టన్నులు అవసరం
- వ్యవసాయ రంగానికి ప్రభుత్వం పెద్దపీట
- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు
- మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ తో కలిసి పెద్దపల్లి జిల్లాలో పర్యటన

| 2



- బంగాళాఖాతంలో అల్పపీడనం
- పొంగిపొర్లుతున్న వాగులు వంకలు
- తెలుగు రాష్ట్రాలకు వాతావరణ శాఖ అలర్ట్
- 24 గంటల్లో హైదరాబాద్ లో మోస్తారు వర్షం
- అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సీఎస్ శాంతికుమారి ఆదేశం

| 2



విస్తారంగా కురుస్తున్న వర్షాలతో గోదావరి జలాలతో నిండుకుండలా దర్శనమిస్తున్న మేడిగడ్డ బ్యారేజ్

# ముంచెత్తుతున్న వానలు



సికింద్రాబాద్ మహంకాళి బోనాల ఉత్సవాలకు రావాలని ఆలయ అర్చకులు, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి ఆహ్వానించారు

# తాకట్టుకు 400 ఎకరాలు

(మొదటి పేజీ తరువాయి)

స్పందించలేదు. తాము భూములు తాకట్టు పెట్టడం లేదని చెప్పలేదు. ఇంత భారీ మొత్తంలో నిధులు ఎలా సేకరిస్తున్నారన్నదానిపై వస్తున్న అనేక సందేహాలకు.. పూర్తిగా కాకపోయినా.. తమ ముందున్న మార్గాలపై మంత్రి శ్రీధర్ బాబు ఓ ప్రకటన చేశారు. అదేమిటంటే సంక్షేమ పథకాలకు మూలధన సేకరణలో సెబీ రూపొందించిన సోషల్ స్టాక్ ఎక్స్ఛేంజి విధానాన్ని వినియోగించుకుంటామని ప్రకటించారు. నిధుల సమీకరణకు సెబీ, రిజర్వ్ బ్యాంకు నిబంధనలకు లోబడి బడా పారిశ్రామిక, వాణిజ్య సంస్థల నుంచి పెట్టుబడులు ఆహ్వానిస్తామని అంటున్నారు. దీనిపై ఆయన ప్రత్యేక సమావేశం కూడా నిర్వహించారు. ఎక్విప్ దేశీ అనే పెట్టుబడుల సేకరణ సంస్థ, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజి ప్రతినిధులు, ప్రభుత్వ కార్యదర్శులు ఇందులో పాల్గొన్నారు. రిజర్వ్ బ్యాంక్ నిర్దేశించిన ఆర్థిక బాధ్యత, నిర్వహణ పరిమితులకు లోబడి ఫండ్ సేకరణ జరపడానికి ప్రత్యామ్నాయ మార్గాల అన్వేషణ అత్యవసరమని శ్రీధర్ బాబు చెబుతున్నారు.

సంస్థలు భవిష్యత్తులో కంపెనీ లాభాల కోసం పెట్టుబడులు సమీకరించేందుకు ఐపీఓకి వెళ్తాంటాయి. ఇప్పుడు సేవాసంస్థలు కూడా తమకు కావలసిన నిధుల కోసం స్టాక్ మార్కెట్ కి వెళ్లొచ్చు. 2019-20 సంవత్సరపు బడ్జెట్ లో సోషల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ప్రతిపాదన వచ్చింది. ఎన్ఎస్ ఈ, బిఎస్ ఈ ఎక్స్ఛేంజీల్లో అనుమతులు పొంది ఇటీవలే ఆచరణలోకి వచ్చింది. ఉన్నతి ఫౌండేషన్ అనే స్వచ్ఛంద సంస్థ యువతకు వృత్తి విద్యల్లో శిక్షణ ఇచ్చేందుకు సోషల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ లో నమోదుచేసుకుంది. ఇరవై రోజుల్లోనే దానికి రూ.కోటీ 80 లక్షలు సమకూరింది. తాము కూడా రైతులకు రుణమాఫీ చేస్తున్నాం కాబట్టి.. లాభాపేక్ష లేకుండా తమ వద్ద పెట్టుబడులు పెట్టాలని ఈ విధానం ద్వారా ప్రభుత్వం ప్రయత్నిస్తోందని అనుకోవచ్చు. దీని ద్వారా పదిహేను వేల కోట్ల వరకూ సమీకరించాలని అనుకుంటోంది.ఇలా విభిన్న మార్గాలను అంచనా వేసుకుని కచ్చితంగా నిధులు సమకూరుతాయనే లెక్కలతో రేవంత్ రెడ్డి రంగంలోకి దిగారు. ఆ కాన్ఫిడెన్స్ తోనే ముందుకు వెళ్తున్నారు. ఈ కొత్త విధానాలు ఇతర రాష్ట్రాల ప్రభుత్వాలకు కొత్త దారి చూపిస్తాయని అనుకోవచ్చు.

# నేడు నీట్ రిజల్ట్స్..

NATIONAL TESTING AGENCY
Excellence in Assessment

(మొదటి పేజీ తరువాయి)

ప్రశ్నలు సంధించారు. 2022లో 17,64,570 మంది, 2023లో 20,38,526 మంది, 2024లో 23,33,297 మంది హాజరయ్యారు. 2022తో పోల్చితే దాదాపు 33 శాతం మంది అధికంగా 2024లో పరీక్షకు హాజరయ్యారు. అలాగే టాప్ స్కోర్ లోనూ గణనీయమైన పెరుగుదల కనిపిస్తుంది. 550-720 మార్కుల స్కోర్ చేసే అభ్యర్థుల సంఖ్య కూడా 5 రెట్లు పెరిగిందని సీనియర్ న్యాయవాది నరేంద్ర హుడా విచారణ సమయంలో ఎత్తి చూపారు. ఇది పేపర్ లీకేజీని సూచించగలదా అని సీజేఐ చంద్రచూడ్ ఆయనను ప్రశ్నించారు. హుడా సమాధానం చెబుతూ.. దీనిని రెడ్ ఫ్లాగ్ గా పరిగణించి, తదుపరి విచారణను అభ్యర్థించారు. అలాగే పిటిషనర్లకు వచ్చిన కనీస మార్కులపై సమాచారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోర్టు ఆదేశించింది.

సొలిసిటర్ జనరల్ వెల్లడించిన వివరాల ప్రకారం కేవలం131 మంది విద్యార్థులు మాత్రమే నీట్ రీ-టెస్ట్ కోరుతున్నట్లు సమాచారం. పరీక్ష పవిత్రత దెబ్బతిన్నట్లు నిరూపితం అయితే తప్ప.. రీటెస్ట్ పెట్టేందుకు ఆదేశించలేమని కోర్టు వెల్లడించింది. పలు అంశాలపై చర్చించిన ధర్మాసనం తదుపరి విచారణను జులై 22వ తేదీకి వాయిదా వేసింది. అదే రోజు తీర్పు కూడా వెలువడే అవకాశం ఉంది.కేంద్ర ప్రభుత్వ శాఖలు, విభాగాల్లో 3,712 పోస్టుల భర్తీకి నిర్వహించిన కంబైన్డ్ హయ్యర్ సెకండరీ లెవెల్ ఎగ్జామినేషన్ 2024 (టైర్ -1)కు సంబంధించిన ప్రాథమిక ఆన్సర్ కీ విడుదలైంది. ఈ మేరకు స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఎస్ ఎస్ సీ) ప్రకటన విడుదల చేసింది. ఎస్ ఎస్ సీ సీహెచ్ ఎస్ఎల్ఈ 2024 పరీక్ష ఆన్ లైన్ లో జులై 1 నుంచి 11 వరకు దేశవ్యాప్తంగా ప్రధాన కేంద్రాల్లో నిర్వహించిన విషయం తెలిసిందే. అభ్యర్థులు తమ రోల్ నంబర్, పాస్ వర్డ్ నమోదు చేసి సమాధానాల కీ, రెస్పాన్స్ షీట్ లను డౌన్ లోడ్ చేసుకోవచ్చు. కీపై అభ్యంతరాలు లేవనెత్తేవారు రూ.100 రుసుముతో జులై 23వ తేదీలోగా ఆన్ లైన్ లో తెలియజేయాలని తెలిపింది.

# గ్రూప్ 2 వాయిదా

(మొదటి పేజీ తరువాయి)

783 గ్రూప్ - 2 పోస్టుల భర్తీకి టీఎస్‌పీఎస్సీ 2022, డిసెంబర్‌లో నోటిఫికేషన్ విడుదల చేయగా.. 5.51 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. డీఎస్సీ, గ్రూప్ - 2 వెనువెంటనే ఉండడంతో పరీక్ష వాయిదా వేయాలని నిరుద్యోగులు డిమాండ్ చేశారు. గత కొంతకాలంగా ఆందోళనలు సైతం నిర్వహించారు. పరీక్ష వాయిదాతో పాటు పోస్టుల సంఖ్య కూడా పెంచాలని విజ్ఞప్తి చేశారు. అయితే, ఇప్పటికే పలు కారణాలతో వాయిదా పడ్డ పరీక్ష తాజాగా.. మరోసారి వాయిదా పడింది. డిసెంబరులో పరీక్ష నిర్వహించే తేదీలను త్వరలోనే ప్రకటిస్తామని టీజీపీఎస్సీ అధికారులు తెలిపారు.

**ఓయూలో సంబురాలు**

గ్రూప్ 2 ఉద్యోగాలను వాయిదా వేసినందుకు కాంగ్రెస్ పార్టీ టిపిసిసి అధికార





TELANGANA PUBLIC SERVICE COMMISSION # HYDERABAD
GROUP - II SERVICES - NOTIFICATION NO.28/2022
DATED:29/12/2022 (GENERAL RECRUITMENT)

PRESS NOTE

It is hereby informed that the Commission having deliberated on the proximity of examination dates between various recruitments has decided to reschedule the Group-II Exams scheduled on 07th & 08th August, 2024 to December, 2024.

The dates on which the Group - II exam would be conducted in the month of December would be announced later.

PLACE: Hyderabad.
DATED: 19/07/2024

Sd/-
Dr. E. Naveen Nicolas, IAS.,
SECRETARY

ప్రతినిధి చనగాని దయాకర్ ఆధ్వర్యంలో ఓయూ ఆర్ట్స్ కళాశాల వద్ద సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా చనగాని దయాకర్ మాట్లాడుతూ గత 20 రోజులుగా వివిధ రూపాల్లో ప్రభుత్వానికి గ్రూప్2 అభ్యర్థులు విన్నవించుకోవడంతో డిసెంబర్ వరకు ప్రభుత్వం పొడిగించారు. ఇది కోతల ప్రభుత్వం కాదు చేతల ప్రభుత్వం నిరుద్యోగుల ప్రభుత్వం. త్వరలో జాబ్ క్యాలెండర్ ను విడుదల చేసి నిరుద్యోగులు లేని రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దడమే కాంగ్రెస్ లక్ష్యమన్నారు. గత ప్రభుత్వం ఉద్యోగాలు ఇవ్వకుండా మోసం చేసింది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఆరు నెలల్లోనే ప్రభుత్వం 30 వేల పోస్టులను భర్తీ చేయడం జరిగిందని.ఇది నిరుద్యోగుల ప్రభుత్వమని కొనియాడారు.

# బండీ..రాజీనామా చేస్తావా..

**హైదరాబాద్, జూలై 19 (ప్రజాస్వరం)**: కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ ప్రకారం రైతులకు 2 లక్షల రుణమాఫీ అమలు చేసిందని అందులో భాగంగా నిన్నటి వరకు లక్ష రూపాయల లోపు ఉన్న రైతులకు రుణమాఫీ చేశామని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. కానీ కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు కేంద్రమంత్రి బండి సంజయ్ మాట్లాడిన తీరు విడ్డూరంగా ఉందని విమర్శించారు. రాష్ట్రంలో 70 శాతం మంది రైతులకు రుణమాఫీ వర్తించడం లేదంటున్న బండి సంజయ్ అది నిరూపించకపోతే మంత్రి పదవికి రాజీనామా చేస్తావా అని డిమాండ్ చేశారు. రైతులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మొత్తం భారతదేశ చరిత్రలోనే 2 లక్షల రుణమాఫీ ఒకేసారి చేస్తుంటుంటే దానిని భరించలేకనే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని తెలిపారు. గతంలో రైతులకు వ్యతిరేకంగా నల్ల చట్టాలు తెచ్చి రైతులకు ఆత్మహత్యలకు కారణమైన మీరు ఈరోజు రైతులకు ఇంత పెద్ద ఎత్తున సంక్షేమం జరుగుతుంటుంటే సమర్థించాల్సింది పోయి.. సమర్థించకపోగా విమర్శిస్తున్నారంటే అది మీ కుహనా బుద్ధి అర్థం అవుతుందన్నారు.. మీరు కేంద్రం నుండి రాష్ట్రానికి ఏం తెస్తారో చెప్పండి. రైతులకు ఏం తెస్తారో తెలంగాణ ప్రజలకు చెప్పాలన్నారు.

రైతులకు నల్ల చట్టాలను తెచ్చి అణిచివేసే ప్రయత్నం చేసిన మీకు రైతుల గురించి మాట్లాడే హక్కు ఉందా అని ప్రశ్నించారు.. గుజరాత్ లో భారీ వర్షాలు కురిస్తే వందల కోట్లు కేటాయించిన మీ ప్రభుత్వం తెలంగాణ రైతాంగం భారీ వర్షాలకు పంట నామ రూపలేకుండా పోతే పంట నష్ట పరిహారం ఒక్క రూపాయి అయినా విడుదల చేశారా అని ప్రశ్నించారు.

తక్షణమే బండి సంజయ్ రైతులకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. 2019 మీ ఎన్నికల మేనిఫెస్టో లో 60 ఏళ్లు దాటిన రైతులకు పెన్షన్ ఇస్తామన్నారు... ఎంతమందికి ఇచ్చారు... రైతుల మీద ఫసల్ భీమా. భారాన్ని పెంచారు. ఎరువుల సబ్సిడీలో 75 వేల కోట్లు కోత పెట్టారు. కాంప్లెక్స్ ఎరువుల ధరలను రెట్టింపు చేశారు.అగ్రికల్చర్ సెస్ పేరుతో పంట ఖర్చులు పెంచారు. బండి సంజయ్ వ్యవహార శైలి చూస్తుంటే గురివింద గింజ నలుపెరుగదు అనే సామెతను గుర్తు చేస్తుంది. రైతులకు జరుగుతున్న కార్యక్రమాన్ని ప్రశంసించే ప్రయత్నం చేయండి..అంతే తప్ప రైతులకు సంబంధించిన ఈ మంచి కార్యక్రమాన్ని విమర్శించే ప్రయత్నం చేయవద్దని డిమాండ్ చేస్తున్నానని అన్నారు.

# సీఎం అమెరికా టూర్

**వచ్చే నెల 3 నుంచి 11వ తేదీ వరకు షెడ్యూల్**

**పెట్టుబడులే ప్రధాన ఎజెండాగా పర్యటన**

**అంతర్జాతీయ కంపెనీల ప్రతినిధులతో సమావేశాలు**

హైదరాబాద్, జూలై 19 (ప్రజాస్వరం) : తెలంగాణలో పెట్టుబడులు పెట్టేలా అంతర్జాతీయ పారిశ్రామిక వేత్తల్ని ఆహ్వానించేందుకు సీఎం రేవంత్ రెడ్డి అమెరికా వెళ్లనున్నారు. అధికారులు, మంత్రుల బృందంతో ఆయన ఆగస్టు మూడో తేదీన అమెరికాకు బయలుదేరుతారు. అమెరికాలోని పలు నగరాల్లో పర్యటించి మల్టీనేషనల్ కంపెనీల ప్రతినిధులతో సమావేశం అవుతారు. పలు కంపెనీల సీఈఓ లు, పారిశ్రామికవేత్తలను కలసి తెలంగాణ రాష్ట్రంలో ఉన్న అవకాశాలపై ప్రజెంటేషన్ ఇచ్చిన తర్వాత ఆగస్టు 11న హైదరాబాద్ కు వచ్చే అవకాశం ఉంది. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత రెండో సారి విదేశీ పర్యటనకు వెళ్తున్నారు. గతంలో దావోస్ లో జరిగిన పెట్టుబడుల సదస్సుకు జనవరిలో హాజర్యయారు. పలు అంతర్జాతీయ కంపెనీలతో ఒప్పందాలు చేసుకున్నారు. ఇటీవల మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, శ్రీధర్ బాబు అమెరికాలో పర్యటించారు. పలు కంపెనీల ప్రతినిధులతో సమావేశం అయ్యారు. ఇప్పుడు నేరుగా ముఖ్యమంత్రి రంగంలోకి దిగుతున్నారు. వారం రోజుల పాటు పర్యటనలో ఆయన తెలంగాణ ప్రవాసులను కూడా కలిసే అవకాశాలు ఉన్నాయి. అనేక పెట్టుబడుల ప్రతిపాదనలు ఉన్నాయని వాటిని ఫాలో అప్ చేసుకోవాల్సి ఉందని అధికార వర్గాలు చెబుతున్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న కేటీఆర్ పెట్టుబడుల కోసం విదేశీ పర్యటనలకు వెళ్లేవారు. ముఖ్యమంత్రి కేసీఆర్ చాలా అరుదుగానే విదేశీ టూర్లకు వెళ్లారు. కానీ కేటీఆర్ మాత్రం మొత్తం బాధ్యత తనపై వేసుకుని దావోస్, అమెరికా, యూరప్ సహా పలు దేశాల్లో పర్యటించి అంతర్జాతీయ కంపెనీలతో పెట్టుబడుల ఒప్పందాలు చేసుకునేవారు. ఇప్పుడు నేరుగా ముఖ్యమంత్రే విదేశీ పర్యటనకు వెళ్తుండటంతో.. గ్లోబల్ ఇన్వెస్టర్ల నుంచి మరింత స్పందన వస్తుందన్న నమ్మకంతో ఉన్నారు. ప్రతిష్టాత్మక ప్రాజెక్టుల్లో పెద్ద ఎత్తున విదేశీ కంపెనీల భాగస్వామ్యం ఉండాలని రేవంత్ కోరుకుంటున్నారు. ముఖ్యంగా మూసీ ఆధునికీకరణ లాంటి ప్రాజెక్టుల విషయంలో విదేశీ సంస్థల సాయం ఉండాలని భావిస్తున్నారు. అలాగే ఫార్మా, టెక్ రంగాల్లో హైదరాబాద్ కు ఉన్న ఇమేజ్ దృష్ట్యా మరిన్ని కంపెనీలను ఆకర్షించేందుకు ప్రయత్నిస్తున్నారు.

# ఆయిల్ పామ్‌ను ప్రోత్సహించాలి

**దేశానికి 100 లక్షల మెట్రిక్ టన్నులు అవసరం**

**వ్యవసాయ రంగానికి ప్రభుత్వం పెద్దపీట**

**వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు**

**మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ తో కలిసి పెద్దపల్లి జిల్లాలో పర్యటన**

**పెద్దపల్లి జూలై 19 (ప్రజాస్వరం):** ఆయిల్ పామ్ పంట సాగు దిశగా రైతులను ప్రోత్సహించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు పెద్దపల్లి జిల్లాలో పర్యటించి పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం, శంకుస్థాపన కార్యక్రమాల్లో రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, బీసీ సంక్షేమ శాఖ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణా రావు, రామగుండం శాసనసభ్యులు మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ లతో కలిసి పాల్గొన్నారు. ఓదెల మండలం కొలనూరు గ్రామం చేరుకున్న మంత్రులకు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఘనంగా స్వాగతం పలికారు.

అనంతరం రూ. 13 కోట్ల 30 లక్షలతో నిర్మించిన పెద్దపల్లి నుంచి ఓదెల వయా కొత్తపల్లి, కొలనూరు వరకు వెళ్ళే రోడ్డును, కోటి 56 లక్షలతో నిర్మించిన కొలనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవనాన్ని మంత్రులు ప్రారంభించారు.

అనంతరం రోడ్డు మార్గం ద్వారా కాల్వ శ్రీరాంపూర్ మండలం పెద్దరాతుపల్లి గ్రామానికి చేరుకున్న మంత్రులు, అక్కడ తిరుమల ఆయిల్ కెమికల్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ వారిచే 170 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేయబోతున్న ఆయిల్ పామ్ ఫ్యాక్టరీకి మంత్రుల బృందం శంకుస్థాపన చేసి అనంతరం కాల్వ శ్రీరాంపూర్ రెడ్డి గార్డెన్స్ లో ఆయిల్ పామ్ రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు. ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రైతులు తమ అనుభవాలను మంత్రి దృష్టికి తీసుకొని వెళ్ళారు.

ఆయిల్ పామ్ సాగు అంతర్ పంటల సాగు, వాటితో వచ్చే ఆదాయం వంటి పలు అంశాలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. ముత్తారం మండలం అడవి శ్రీరాంపూర్ గ్రామానికి చెందిన రైతు గత సంవత్సరం నుంచి 8 ఎకరాలలో ఆయిల్ పామ్ సాగు చేస్తున్నామని, సబ్సిడీ రూపంలో



మంత్రి పొన్నం ప్రభాకర్ ను సన్మానిస్తున్న కాంగ్రెస్ శ్రేణులు



కొలనూరులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రులు తుమ్మల నాగేశ్వర్ రావు, పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్ బాబు

ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు, వ్యవసాయ శాఖ, హార్టికల్చర్ డిపార్ట్మెంట్ అధికారులు అందిస్తున్న సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఈ సందర్భంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు మాట్లాడుతూ రాష్ట్ర రైతాంగం తమపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం ముందుకు వెళ్తుందని అన్నారు. నీటి పారుదల, విద్యుత్ రంగం, ఇతర వ్యవసాయ అనుబంధ రంగాలపై ప్రత్యేక దృష్టి సారించిందని అన్నారు.

రైతులకు రుణ మాఫీ చేయాలనే సంకల్పంతో రైతు రుణమాఫీ ప్రక్రియను ప్రారంభించి లక్ష రూపాయల వరకు రుణం ఉన్న రైతుల ఖాతాలలో మాఫీ సొమ్ము జమ చేశామని అన్నారు.

పెద్దపెల్లి జిల్లాలో ఆయిల్ పామ్ సాగు ఇప్పటి వరకు 2500 ఎకరాల వరకు మాత్రమే జరిగిందని, ప్రస్తుత సంవత్సరం ఆయిల్ పామ్ విస్తీర్ణం 10 వేల ఎకరాలకు పెరగాలని, ఆసక్తి గల రైతులందరిని ఆయిల్ పామ్ దిశగా మళ్లించాలని అన్నారు.

ఆయిల్ పామ్ పంట మొదటి మూడు సంవత్సరాలు అంతర్ పంటల ద్వారా ఆదాయం వస్తుందని, రైతులు పొద్దు తిరుగుడు అంతర్ పంట కింద వేస్తే ఇదే కంపెనీ మద్దతు ధరపై కొనుగోలు చేస్తుందని మంత్రి తెలిపారు. వ్యవసాయ శాఖ, హార్టికల్చర్ అధికారుల సూచనలు రైతులు పాటించాలన్నారు.

మనకు అందుబాటులో ఉన్న భూమి లోనే ఎక్కువ పంటలు పండించాలని, రైతులు పంట మార్పిడి విధానాన్ని అమలు చేయాలని ఆయన సూచించారు.

మనకు అవసరమైన అన్ని రకాల నేలలు వాతావరణం, వనరులు అందుబాటులో ఉన్నాయని వీటిని వినియోగించుకొవాలని అన్నారు. మన దేశానికి ఆయిల్ పామ్ 100 లక్షల మెట్రిక్ టన్నులు అవసరం ఉందని, కానీ మన దగ్గర ప్రస్తుతం కేవలం 3 లక్షల 96 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే పండుతుందని, మిగిలినవి ఇండోనేషియా, మలేషియా వంటి విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటు న్నామని అన్నారు. భారతదేశంలో అత్యధికంగా పామ్ ఆయిల్ పండిస్తున్నది తెలుగు రాష్ట్రాలు మాత్రమేనని, ప్రతి ఎకరానికి మూడు , నాలుగు సంవత్సరాల సమయానికి పామ్ ఆయిల్ రైతుకు 51 వేల వరకు సబ్సిడీ సొమ్ము ప్రభుత్వం అందిస్తుందని అన్నారు.

# రాష్ట్రంలో ముంచెత్తుతున్న వానలు

**బంగాళాఖాతంలో అల్పపీడనం**

**పొంగిపొర్లుతున్న వాగులు వంకలు**

**24 గంటల్లో హైదరాబాద్‌లో మోస్తారు వర్షం**

**అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సీఎస్ శాంతికుమారి ఆదేశం**



మేడిగడ్డ బ్యారేజ్ వద్ద గోదావరి పరుగులు

**హైదరాబాద్, జూలై 19 (ప్రజాస్వరం):** తెలంగాణలోని అన్ని జిల్లాలకు మోస్తరు నుంచి భారీ వర్షాలు పడేఅవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ సూచించింది. దక్షిణ – ఉత్తర బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో రాష్ట్ర వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉంది. మధ్య ట్రోపోస్పియర్ వరకు ఆవర్తనం విస్తరించింది. జైసాల్మయిర్, కోట, గుణ, కళింగపట్నం గుండా వెళుతూ మధ్య బంగాలఖాతం వరకు సముద్ర మట్టానికి 1.5 కిలోమీటర్ల ఎత్తులో ఋతుపవన ద్రోణి కొనసాగుతుంది. గాలి విచ్ఛిన్నతి 20 డిగ్రీల ఉత్తర అక్షాంశం గుండా సగటు సముద్ర మట్టానికి 3.1 కి. మీ. నుండి 5.8 కి. మీ ఎత్తు మధ్యలో కొనసాగుతుంది. దీంతో రాగాల రెండు మూడు రోజులలో రాష్ట్రంలో కొన్ని జిల్లాలలో అతి భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు, అక్కడ అక్కడ భారీ వర్షాలు కొన్ని కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఉరుములు, మెరుపులుతో గంటకు 30 నుండి 40 కి. మీ మేర, అప్పుడప్పుడు 50 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది. ఉమ్మడి.. ఆదిలాబాద్, హైదరాబాద్, నిజామాబాద్, మెదక్, వరంగల్, నల్లగొండ, కరీంనగర్,రంగారెడ్డి, సంగారెడ్డి, ఖమ్మం, మహబూబ్ నగర్ జిల్లాకు వర్ష సూచన జారీ అయ్యింది. ఇక రాగాల 24 గంటలలో హైదరాబాద్ నగర వ్యాప్తంగా మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వెల్లడించింది.రాష్ట్రంలో విస్తారంగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో అధికారుల కీలక సూచనలు.. అప్రమత్తంగా ఉండాలంటూ హెచ్చరికలు జారీ చేసింది.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అశ్వరావుపేట పెద్దవాగుకు పెద్ద ఎత్తున వరద రావడం వల్ల గేట్లు ఎత్తడంతో దిగువ భాగంలోని గ్రామాల రైతులు వరద నీటిలో చిక్కుకున్న సంఘటనతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్, ఎస్పీ, నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులతో శుక్రవారం సాయంత్రం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి సహాయ పునరావాస చర్యలను సమీక్షించారు. ఈ టెలికాన్ఫరెన్స్ లో సీఎస్ మాట్లాడుతూ.. ఎట్టిపరిస్థితుల్లోనూ ప్రాణనష్టం కలగకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. పెద్ద వాగుకు చెందిన మూడు గేట్లు ఎత్తడంతో సమీపంలోని నాలుగు గ్రామాల్లోకి వరద నీరు ఒక్క సారిగా చేరడంతో నీటిలో చిక్కుకున్న 28 మందిని రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖ బృందాలు రెండు హెలికాప్టర్ల సహాయంతో రక్షించి సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు

మరో 20 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించే ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. ఇప్పటికీ ఎన్డీఆర్ఎఫ్, రాష్ట్ర రెస్క్యూ బృందాలు సహాయ పునరావాస కార్యక్రమాలలో నిమగ్నమై ఉన్నాయని అన్నారు. గుమ్మడివెల్లి, కోయగూడెం, కొత్తూరు, గాజులపల్లి గ్రామాల ప్రజలను పునరావాస శిబిరాల్లోకి తరలించే ప్రక్రియ కొనసాగుతుందని కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ పేర్కొన్నారు. ప్రజల ప్రాణాలు అత్యంత ప్రధానమని, సహాయ పునరావాస కార్యక్రమాలకు సంబంధించి హైదరాబాద్ నుంచి ఏ విధమైన సహాయ సహకారాలు కావాలన్న అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు సీఎస్ స్పష్టం చేశారు. పరిసర గ్రామాల్లోని చెరువులు, కుంటలు తెగకుండా ముందస్తు చర్యలను చేపట్టాలని జిల్లా యంత్రాంగానికి సూచించారు. భారీ వర్షాలు, వరదల వల్ల సహాయ కార్యక్రమాల్లో పాల్గొనాలని పోలీసు యంత్రాంగాన్ని ఆదేశించినట్లు డీజీపీ జితేందర్ తెలిపారు. భారీ వర్షాల వల్ల ఒక్కసారిగా 40 వేల క్యూసెక్కుల వరద రావడంతో గేట్లు ఎత్తాల్సివచ్చిందని, ప్రస్తుతం వరద తగ్గిందని నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా వివరించారు.

ప్రజాస్వరం
PRAJASWARAM తెలుగు దినపత్రిక

# మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

3 | www.prajaswaramdaily.com | శనివారం 20 జూలై 2024

# హస్తినకు మెదక్ కలెక్టర్

## బంగ్లాదేశ్ డిప్యూటీ కమిషనర్స్, కలెక్టర్స్‌కు శిక్షణ

**మెదక్, జులై 19 (ప్రజా స్వరం) :**

మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ శుక్రవారం ఢిల్లీ వెళ్లారు. భారత కేంద్ర మంత్రిత్వ శాఖ పరిధిలోని పరిపాలన సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల విభాగం భారతీయ పాలనా, ప్రజా విధానం అనే అంశంపై బంగ్లాదేశ్ దేశానికి చెందిన డిప్యూటీ కమిషనర్స్‌తో పాటు ఆయా జిల్లాల కలెక్టర్లకు మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ ముఖ్యతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పరిపాలన సంస్కరణలు ప్రజా ఫిర్యాదుల విభాగం ద్వారా భారతీయ పాలన, ప్రజా విధానం అంశంపై బంగ్లాదేశ్ డిప్యూటీ కమిషనర్స్, జిల్లా కలెక్టర్లకు రాహుల్ రాజ్ శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన సుపరిపాలనపై చేపట్టిన చర్యలు గురించి పూర్తి స్థాయిలో వివరించారు. దీంతో పాటు గతంలో ఆసిఫాబాద్ కలెక్టర్‌గా పని చేసిన సమయంలో ఇన్నోవేటర్ ప్రోగ్రాంలో భాగంగా వాటి గుర్తింపుగా వచ్చిన ప్రధానమంత్రి అవార్డుకు సంబంధించిన వివరాలు కలెక్టర్లకు వివరించారు. అలాగే ప్రస్తుతం దేశంలో సుపరిపాలనపై చేపడుతున్న ప్రత్యేక కార్యక్రమాలను పవర్ పాయింట్ ద్వారా అందరికీ తెలియజేశారు. కలెక్టర్ రాహుల్‌రాజ్ సుపరిపాలనపై అవగాహన కల్పించడం తీరును ఉన్నతాధికారులు, ఇతర దేశస్తులు ప్రజా ప్రతినిధులు మెచ్చుకున్నారు. అనంతరం మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్‌కు అభినందిస్తూ మెమొంటో అందజేశారు.







# ఇండిపెండెంటే విజేత

## తీర్పు వెలువరించిన సంగారెడ్డి జిల్లా కోర్టు

### అడిషనల్ కలెక్టర్‌కు జడ్జిమెంట్ కాపీ అందజేత

**పటాన్‌చెరు, జూలై19,(ప్రజాస్వరం) :**

బొల్లారం మున్సిపాలిటీలో 2020 ఎన్నికల్లో జరిగిన చౌదరి క్యాస్ట్‌కి చెందిన బూరం శైలజ అనే మహిళ బీసీ జనరల్ స్థానం (10వ వార్డు) లో పోటీ చేసి గెలుపొందారు. ఈ మేరకు రెండో స్థానంలో ఉన్న ఇండిపెండెంట్ అభ్యర్థి నర్సింహా రాజు అసలు విషయం తెలుసుకొని సంగారెడ్డి జిల్లా కోర్టును ఆశ్రయించాడు. నాలుగున్నర సంవత్సరాల విచారణ తర్వాత న్యాయాధికారి రెండో స్థానంలో ఉన్న ఇండిపెండెంట్ అభ్యర్థి నరసింహ రాజును ఎన్నికలో విజేతగా ప్రకటించారు. న్యాయాధికారి ఇచ్చిన జడ్జిమెంట్ కాపిని శుక్రవారం బొల్లారం మున్సిపల్ కాంగ్రెస్ నాయకులు, కౌన్సిలర్లు అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్‌ని కలిసి అందజేశారు. నర్సింహరాజుకి తగు విధంగా న్యాయం చేస్తామని అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్ హామీనిచ్చారు. కార్యక్రమంలో



బొల్లారం మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, కౌన్సిలర్ గోపాలమ్మ, జిల్లా కార్మిక నాయకులు లక్ష్మారెడ్డి, మహేందర్‌రెడ్డి, రాజగోపాల్, నర్సింహరాజు, వెంకటయ్య, యువ నాయకులు ప్రవీణ్‌రెడ్డి, బషీర్, ఇమ్రాన్, తదితరులు పాల్గొన్నారు.

# సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



**రామాయంపేట, జులై 19 (ప్రజా సర్వం) :**

రైతు రుణమాఫీ చేసిన సందర్భంగా మెదక్ జిల్లా రామాయంపేట మండలం శివయిపల్లి గ్రామంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి శుక్రవారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి, మైనంపల్లి రోహిత్‌రావుకి రుణపడి ఉంటామన్నారు. కార్యక్రమంలో రాజు, లక్ష్మణ్, కార్తీక్, కరుణాకర్, రవి, గోపాల్, బాపు, నర్సింహులు, రాములు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# గుంతలు పూడ్చండి మహాప్రభో

**మెదక్, జులై 19 (ప్రజా స్వరం) :**

మెదక్ జిల్లా కేంద్రం రాందాస్ చౌరస్తా మెయిన్ రోడ్డుపై గుంత ఏర్పడడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం వందల వాహనాలు, ప్రజలు ఈ రహదారిపై తిరుగుతారు. మిషన్ భగీరథ పైప్‌లైన్ కోసం రోడ్డు తవ్వడంతో గుంత ఏర్పడింది. వర్షా కాలం కావడంతో గుంత మరింత లోతు ఏర్పడి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుపై ఉన్న గుంతను పూడ్చి మరమ్మతులు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

# ప్రైవేటులో ఉచిత వైద్యం అందించాలి

**మెదక్, జులై 19 (ప్రజా స్వరం) :**

జిల్లాలోని ప్రైవేట్ ఆస్పత్రుల్లో నిరుపేదలకు 10 శాతం వైద్యం ఉచితంగా అందించాలని ఎమ్మార్పీఎస్, దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం మెదక్ జిల్లా కలెక్టరేట్‌లో ఎంఆర్పీఎస్, దళిత సంఘాల నాయకుల ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెదక్ జిల్లాలో ప్రైవేట్ ఆస్పత్రిలో నిరుపేదలకు పది శాతం ఉచిత వైద్యం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వ ఆస్పత్రిలోని డాక్టర్లు ప్రైవేట్ ఆస్పత్రిలో నడపకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో డాక్టర్లు సమయపాలన పాటించాలని ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. జీవో నెంబర్ 162 జీవో ప్రకారం దారిద్ర రేఖకు దిగువగా ఉన్న పేద రోగులకు ఆస్పత్రిలో ఖరీదైన వైద్యం అందించడంలో ప్రైవేట్ ఆస్పత్రిలో నిరాకరించడం దురదృష్టమన్నారు. పేదలు ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్సకు సంబంధించిన మందులు పూర్తి స్థాయిలో అందించాల్సిందిగా ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉన్నప్పటికీ రాష్ట్ర, జిల్లా స్థాయి ప్రైవేట్ హాస్పిటల్ యజమానులు ఉమ్మడిగా యూనియన్‌గా ఏర్పడి ప్రభుత్వ నిబంధనలు బేకాతరు చేస్తున్నారన్నారు. ప్రైవేట్ ఆస్పత్రులపై చర్యలు తీసుకోని పేదలకు ఉచితంగా వైద్యం అందించాలని ప్రైవేట్ ఆస్పత్రిల గుర్తింపును రద్దు చేయాలని కోరారు. ప్రభుత్వ ఆస్పత్రిలో డాక్టర్‌లు పనిచేస్తూ ప్రైవేట్ దవాఖానలు నడుపుతున్నారన్నారు. వీటి వల్ల ప్రభుత్వ ఆస్పత్రిలో పేదలకు పూర్తి స్థాయిలో వైద్యం అందకుండా సతమతమవుతున్నారు. ప్రభుత్వ ఆస్పత్రికి సంబంధించిన డాక్టర్‌లు ప్రైవేట్ ఆస్పత్రులుగా నడిపే డాక్టర్ లను తొలగించాలని డిమాండ్ చేశారు. మెదక్ రాందాస్ చౌరస్తా, వేల్కంబోర్డు, అంబేడ్కర్ చౌరస్తా, హవేలీ ఘణపూర్ చౌరస్తా, నర్సాపూర్ చౌరస్తాలో గల అంబేడ్కర్, జగ్గజీవన్ రామ్ మహనీయుల విగ్రహాలను అధికారికంగా పది సంవత్సరాల క్రిందట తీసేసిన విగ్రహాలను యథావిధిగా పునఃప్రతిష్టాపన చేయాలన్నారు. మహనీయుల విగ్రహాల పట్ల నిర్లక్ష్యంగా వివక్షతో వ్యవహరిస్తున్న ఆర్అండ్‌బీ, మున్సిపల్ అధికారుల తీరు మార్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మెదక్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ అస్త్రగళ్ల బాలరాజు మాదిగ, ఎమ్మార్పీఎస్ మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లిశెట్టి రవి మాదిగ, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు మురళీమాదిగ, దండోరా సామెల్ మాదిగ, పాతూరి రాజుమాదిగ, మాలల హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు మైసయ్య, నాయకులు విఠల్, స్వామి, ఎల్లం, నర్సింహులు, చంద్రం, యాదులు తదితరులు పాల్గొన్నారు.





# ఎస్పీని కలిసిన ప్రెస్‌క్లబ్ సభ్యులు

**మెదక్, జులై 19 (ప్రజా స్వరం) :**

మెదక్ జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన ఉదయ్ కుమార్‌రెడ్డిని శుక్రవారం మెదక్ ప్రెస్‌క్లబ్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీకి శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సన్మానించారు. మెదక్ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి జర్నలిస్టులతో పరిచయ వేదికను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మెదక్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు నరేష్‌గౌడ్ ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి ప్రసాద్, సభ్యులు నర్సింహచారి, సురేందర్‌రెడ్డి, రియాజ్, ఫరూక్ హుస్సేన్, రాజాగౌడ్, నాగరాజు, శేఖర్, సంగమేశ్వర్, నీలం, సుభాష్, భువన్, తదితరులు పాల్గొన్నారు.

# ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం

## కాంగ్రెస్ పార్టీ జిల్లా జనరల్ సెక్రటరీ చిన్నా ముదిరాజ్

**పటాన్‌చెరు, జులై 19 (ప్రజా స్వరం) :**

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకున్నదని, దీంతో తెలంగాణ రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ సంగారెడ్డి జిల్లా జనరల్ సెక్రటరీ చిన్నా ముదిరాజ్ అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రుణమాఫీని అమలు చేసి కాంగ్రెస్ ప్రభుత్వానికి, సీఎం రేవంత్‌రెడ్డికి తెలంగాణ రైతు సంరక్షణ సమితి అధ్యక్షులు రాష్ట్ర సింగిరెడ్డి భాస్కర్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తామంటే.. బీఆర్ఎస్ హేళన చేసిందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆగస్టు 15 లోగా రుణమాఫీ చేస్తే మాజీ మంత్రి, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని ప్రకటించారని, ఇప్పుడు ఆయన రాజీనామాకు సిద్ధం కావాలన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ వరంగల్ సభలో రైతుల పక్షాన రుణమాఫీ చేస్తానన్నారని, అది తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమలు చేశారన్నారు. హరీశ్‌రావు రాజీనామా చేయడంతో పాటు మళ్ళీ ఎన్నికల్లో పోటీ చేయననే మాటకు కట్టుబడి ఉండాలని సవాల్ విసిరారు. దేశంలోనే తొలిసారిగా కాంగ్రెస్ ప్రభుత్వం ఒకే రోజు 7000 కోట్లతో 11లక్షల 50 వేల మంది రైతులకు లక్షలోపు రుణంమాఫీ చేసి ఆ మొత్తాన్ని రైతులు బ్యాంక్ ఖాతాలో జమ చేయడం జరుగుతుందన్నారు. ఈ సంబురాల్లో రైతులతో కలిసి కాంగ్రెస్ నాయకులు ప్రజాప్రతినిధులు సంబురాలు చేసుకున్నారు. గ్రామగ్రామాన రైతు వేదికల వద్ద సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేసి సంబురాలు జరుపుకొన్నారు.



# మీరు సల్లగా ఉండాలి సార్

## సీఎం రేవంత్‌కు ధన్యవాదాలు తెలిపిన రైతులు

**రామాయపేట, జులై 19 (ప్రజా సర్వం) :**

రైతు రుణమాఫీ చేసిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మెదక్ జిల్లా రామాయంపేట మండలం కాట్రియాల గ్రామానికి చెందిన మద్దూరి లింగం, రాణి అనే రైతులు ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు రుణమాఫీ చేసిన సందర్భంగా శుక్రవారం వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రైతు బాంధవుడన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కాగానే ఆరు హామీలను తప్పకుండా నెరవేర్చుతున్నారు. ఇప్పటివరకు వైయస్ రాజశేఖర్‌రెడ్డి ఒకేసారి రుణమాఫీ చేయడం జరిగిందన్నారు. ఆయన బాటలోనే మన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఒకేసారి రైతులు బ్యాంకుల్లో తీసుకున్న రుణాలను ఏకకాలంలో మాఫీ చేశారన్నారు. ఇలాంటి ముఖ్యమంత్రి దేశంలోనే ఎవరూ లేరని ఆయన కొనియాడారు. మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు ప్రజల కోసం ఎంతో కష్టపడి పనిచేస్తున్నారన్నారు.



ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక





# నిరుపయోగంగా అతిథి గృహం

- పదేళ్లుగా పడకేసిన నూతన భవనం..
- రూ.మూడు కోట్ల అంచనా వ్యయంతో పనులకు శ్రీకారం
- రూ. రెండు కోట్లతో పూర్తి చేసిన భవనం పనులు నిరర్థకం
- అర్ధాంతరంగా నిలిచిపోయిన పనులు
- అతిథులు వస్తే ఆగేది ఎక్కడ ?

**తాండూరు, జూలై 19 (ప్రజాస్వరం):** వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణంలో నీటి పారుదల శాఖ (ఐ అండ్ సి ఎ డి) ఆధ్వర్యంలో 10 ఏళ్ల క్రితం ప్రారంభించిన అతిథి గృహం భవనం నిర్మాణం పనులు నేటికీ అసంపూర్తిగా ఉన్నాయి. దీంతో ఈ భవనం నిర్మాణానికి ఇప్పటి వరకు వెచ్చించిన దాదాపు రూ. రెండు కోట్ల నిధులు నిరర్థకమయ్యాయని స్థానికులు విమర్శిస్తున్నారు. నైజాం నవాబుల కాలంలో 1920లో ఇక్కడ అతిథి గృహం భవనం నిర్మాణం చేపట్టారు. గతంలో నిర్మాణమైన భవనం శిథిలావస్థకు చేరడంతో కొత్త భవనం నిర్మాణానికి నీటి పారుదలశాఖ అధికారులు ప్రతిపాదనలు చేయడంతో 2014లో ప్రభుత్వం అతిథి గృహం నిర్మాణానికి దాదాపు రూ. మూడు కోట్లు నిధులను మంజూరు చేసింది. మిషన్ కాకతీయ పథకంతో చెరువులు, సాగునీటి ప్రాజెక్టులను అభివృద్ధి చేసేందుకు సిద్ధం చేసిన సమయంలోనే తాండూరు పట్టణంలో నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో నూతన భవనం నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించారు. దీంతో నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో రూ.మూడు కోట్ల నిధులతో రెండంతస్తుల భవనం నిర్మాణానికి 2014లో శంకుస్థాపన జరిగింది. అప్పటి రాష్ట్ర నీటిపారుల శాఖ మంత్రి హరీష్ రావు ఈ భవనం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అయితే పనులు చేపట్టిన కాంట్రాక్టర్ పనులు అసంపూర్తిగా ఉండగానే అనారోగ్యంతో మృతి చెందడంతో ఈ భవనం నిర్మాణ పనులు అభ్యంతరంగా నిలిచిపోయాయి. దాదాపు 60 శాతంపైగా భవనం నిర్మాణ పనులు కాంట్రాక్టర్ పూర్తి చేయగా దాదాపు రూ. రెండు కోట్ల మేర బిల్లులు చెల్లించారు. అయితే కాంట్రాక్టర్ చేపట్టిన పనులు ఒకరకంగా ఉండగా అదనంగా దాదాపు రూ. 20 లక్షల వరకు అడ్వాన్సుగా అదనంగా చెల్లించారని సమాచారం. సుమారు రూ. కోటి 60 లక్షల విలువైన పనులు పూర్తయితే అదనంగా అడ్వాన్సుగా 20 లక్షలు చెల్లించారని నీటిపారుదల శాఖ వర్గాల ద్వారా తెలిసింది. దీంతో అంచనాలు సవరించి అదనపు నిధులు మంజూరుకు ప్రభుత్వానికి నీటిపారుదల శాఖ అధికారులు ప్రతిపాదనలు పంపారు. కొత్తగా నిధులు మంజూరు కొత్త టెండర్ ఖరారు చేసి పనులు అప్పగించాలని నిర్ణయించారు. అయితే పనులు చేపట్టి పదేళ్లు గడిచినప్పటికీ నేటికీ అతిథిగృహం భవనం నిర్మాణ పనులు అర్ధాంతరంగానే నిలిచిపోయాయి. దీంతో రూ. కోట్ల నిధులు వెచ్చించిన అతిథులకు ఆతిథ్యం ఇచ్చేందుకు నూతన భవనం సిద్ధంగా లేకపోవడంతో పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు. నైజాం నవాబుల కాలంలో నిర్మించిన పాత భవనాన్ని అలాగే ఉంచితే అయినా దాన్ని మరమ్మతులు చేస్తే ఆ భవనమైన అతిథులకు అతిథులకు అందుబాటులో ఉండేదని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. అయితే తీరా పాతదాన్ని కూల్చివేసి కొత్త భవనం కట్టేందుకు శ్రీకారం చుట్టినప్పటికీ, రూ. కోట్ల నిధులు వ్యయం చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయిందని స్థానికులు విమర్శిస్తున్నారు.



### కార్ల పార్కింగ్‌కు అడ్డాగా మారిన వైనం ..

తాండూరు పట్టణంలోని నీటిపారుదల శాఖ అతిథి గృహం భవనం ప్రదేశం దాదాపు మూడేళ్లుగా ప్రైవేట్ కార్ల యజమానులకు అడ్డాగా మారింది. భవనం చుట్టుపక్కల ప్రదేశాల్లో కార్లను యజమానులు పార్కు చేసి వెళుతున్నారు. స్థానిక నీటిపారుదల శాఖ అధికారులు కూడా ఈ వ్యవహారాన్ని చూసి చూడనట్టు వదిలేస్తున్నారు. దీంతో కొత్తగా నిర్మాణమైన భవనంలో కూడా విలువైన వివిధ సామాగ్రి దొంగల పాలవుతోంది. అలాగే ఇప్పటివరకు నిర్మాణమైన భవనం కూడా నిర్వహణ కొరవడి అధ్వానంగా మారింది. భవనం గోడలు వర్షాలకు బీటలు వారుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఈ విషయంలో చొరవ తీసుకొని అతిథి గృహం నూతన భవనం పనులను వెంటనే పూర్తి చేయించాలని పలువురు కోరుతున్నారు.

### కాంట్రాక్టర్ల వెనుకడుగు...

కాగా మరో రూ. కోటిన్నర విలువైన పనులు అసంపూర్తిగా ఉండడంతో ఈ పనులు తిరిగి చేపట్టేందుకు కొత్తగా టెండర్ ఖరారు చేయడంలో నీటి పారుదల శాఖ అధికారులు విఫలమవుతున్నారన్న వాదన వినిపిస్తున్నాయి. గతంలో చేపట్టిన పనులకు రూ. 20 లక్షలు అదనంగా బిల్లులు చెల్లించడంతో తిరిగి కొత్తగా పనులు చేపట్టే కాంట్రాక్టర్కు నష్టం వస్తుందని ఎవరు ఈ పనులు చేపట్టేందుకు ముందుకు రావడం లేదన్న వాదనలు కూడా వినిపిస్తున్నాయి. అయితే గతంలో ఈ భవనం పనులు చేపట్టిన కాంట్రాక్టర్ అనారోగ్యంతో మృతి చెందడంతో కొత్తగా పనులు చేపట్టేందుకు ఎవరు ముందుకు రావడం లేదని తెలుస్తోంది. తాము తిరిగి పనులు చేపడితే తమకు ఎలాంటి ముప్పు కలుగుతుందో అని జంకుతున్నట్లు సమాచారం.



## రేవంత్ సమీక్ష

- ఇంటిగ్రేటేడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ పై సీఎం, డిప్యూటీ సీఎం భేటీ
- పైలట్ ప్రాజెక్టుగా వికారాబాద్ జిల్లా కొడంగల్‌లో క్యాంపస్ ఏర్పాటు

**వికారాబాద్, జూలై 19 (ప్రజాస్వరం):** అధునాతన వసతులతో విద్యను అందించడంతోపాటు విద్యార్థుల్లో సమానత్వ భావన పెరిగేలా ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ గురుకులాలను ఒకేచోట ఇంటిగ్రేటేడ్ రెసిడెన్షియల్ క్యాంపస్ పేరుతో ఏర్పాటుచేసే ప్రక్రియ వేగవంతమైంది. పైలట్ ప్రాజెక్టుగా సీఎం రేవంత్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న వికారాబాద్ జిల్లా కొడంగల్, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సొంత నియోజకవర్గం మధిర నియోజకవర్గాల్లో ఈ క్యాంపస్‌లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క శుక్రవారం ఆర్కిటెక్ట్స్, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం సహా అధికారులతో సమీక్ష జరిపారు. ఇంటిగ్రేటేడ్ క్యాంపస్‌ల మాస్టర్ ప్లాన్, ఇతర అం శాలపై చర్చించారు. ప్రతి నియోజకవర్గంలో 20 నుంచి 25 ఎకరాల ప్రాంగణంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్స్ ను మినీ ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దేలా ప్రభుత్వం ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసిన సంగతి తెలిసిందే.



## రూ. 2500 కోట్లతో నేవీ రాడార్ స్టేషన్..

- దామగుండం అటవీ ప్రాంతంలో ఏర్పాటు
- 28న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన
- ఏర్పాట్లను పరిశీలించిన వికారాబాద్ జిల్లా కలెక్టర్, పరిగి ఎమ్మెల్యే

**వికారాబాద్, జూలై 19 (ప్రజాస్వరం) :** భారత నావికాదళం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న నేవీ రాడార్ స్టేషన్‌ను రూ.2500 కోట్లతో వికారాబాద్ జిల్లా పరిగి నియోజకవర్గంలోని పూడూరు మండలంలో దామగుండం అటవీ ప్రాంతంలో నెలకొల్పేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 28న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేసేందుకు నిర్ణయించారు. ఈ మేరకు వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ నారాయణరెడ్డి, డీసీసీ అధ్యక్షులు, పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టీ రామ్మోహన్ రెడ్డి అధికారులతో కలిసి శుక్రవారం శంకుస్థాపన ఏర్పాట్లను, హెలిప్యాడ్, సభా స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. పరిగి నియోజకవర్గంలో మరో మైలురాయి ఆవిష్కృతం కానున్నదని తెలిపారు.





## ఆగస్టు 3న అమెరికాకు సీఎం రేవంత్ రెడ్డి

- వారంపాటు యూఎస్‌లోనే రేవంత్ బృందం..

పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా పర్యటన

**రంగారెడ్డి, జూలై 19 (ప్రజాస్వరం) :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికా పర్యటన ఖరారైంది. ఈమేరకు సీఎంవో అధికారులు టూర్ షెడ్యూల్ రిలీజ్ చేశారు. ఆగస్టు 3న రాత్రి రేవంత్ రెడ్డి బృందం అమెరికా బయల్దేరనుంది. ఈ పర్యటనలో భాగంగా పలు కంపెనీల సీఈఓలు, పారిశ్రామికవేత్తలను సీఎం రేవంత్ బృందం కలవనుంది. వారితో చర్చించి రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురానున్నారు. డల్లాస్ తోపాటు ఇతర రాష్ట్రాల్లో రేవంత్ బృందం పర్యటన వారం రోజులపాటు కొనసాగనుంది. ఆగస్టు 11న రేవంత్ రెడ్డి అమెరికా నుంచి తిరిగి రానున్నారు. తెలంగాణలో పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా ఈ పర్యటన కొనసాగనుందని అధికార వర్గాలు వెల్లడించాయి. పలు కంపెనీల సీఈవోలు, పారిశ్రామికవేత్తలను సీఎం కలిసి తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని కోరనున్నారు.

## తెలంగాణలో మోసపూరిత పాలన..

- బీఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్ ప్రభుత్వం తప్పిదాలు
- ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి
- తాండూరులో ఎంపీకి పౌర సన్మానం



**తాండూరు, జూలై 19 (ప్రజాస్వరం):** రాష్ట్రంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన తప్పుల బాటలోనే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా పయనిస్తోందని దీంతో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న తప్పిదాలతో ప్రజలు ఇక్కట్ల పాలవుతున్నారని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి విమర్శించారు. శుక్రవారం బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో తాండూరులో చేవేళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డికి పౌర సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ... పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గెలుపు దేశానికి గర్వకారణమన్నారు. తెలంగాణలోని 8 పార్లమెంట్ స్థానాల్లో బూతు స్థాయి నుంచి, మండల, అసెంబ్లీ, జిల్లా, రాష్ట్ర స్థాయి నాయకులు ఐక్యమత్యంగా పనిచేయడంతో అభ్యర్థుల గెలుపు సునాయాసమైందన్నారు. తాండూరులో గతంలో 4వేల ఓట్లు వస్తే పార్లమెంట్‌లో 80 వేలు ఓట్లు రావడం ప్రజల్లో మార్పుకు నిదర్శనం అన్నారు. తాండూరులో స్వచ్ఛంద సంస్థలు, రాజకీయ, కుల సంఘాల వారు ఓటు వేయడంతోనే తనకు అధిక మెజార్టీ వచ్చిందని అన్నారు. తన విజయానికి సహకరించిన, కృషి చేసిన వాళ్లందరికీ ఈ సందర్భంగా ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో మళ్లీ మోస పూరిత పాలన జరుగుతోందని ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం గతంలో చేసిన తప్పును కొత్త ప్రభుత్వం కూడా చేస్తుందన్నారు. నిబంధనల పేరుతో అర్హత ఉన్న వారిలో 25శాతం మందికి మాత్రమే రుణమాఫీ అమలు చేస్తుందని విమర్శించారు. రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అప్పటి వరకు నేతలు, కార్యకర్తలు రాజకీయాలకు అతీతంగా సమిష్టిగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ ముదిరాజ్, యాలాల ఎంపీపీ బాలేశ్వర్ గుప్త, తాండూరు నియోజకవర్గ బిజెపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## టాస్క్ ఫోర్స్ దాడులు

- రూ. లక్ష 30 వేల విలువైన నిషేధిత గుట్కా ప్యాకెట్లు సీజ్



**వికారాబాద్, జూలై 19 (ప్రజాస్వరం):** జిల్లా ఎస్పీ కే నారాయణ రెడ్డి ఆదేశాల మేరకు టాస్క్ ఫోర్స్ ఇంచార్జ్ ఇన్స్పెక్టర్ వెంకటేశం ఆధ్వర్యంలో జిల్లా టాస్క్ ఫోర్స్ అధికారులు శుక్రవారం కొడంగల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రావులపల్లి గ్రామంలోని కిరణం షాపుపై దాడి చేశారు. సుమారు రూ.1,30,125 విలువైన 55,970 పౌచ్‌లు (ప్యాకెట్లు) నిషేధిత గుట్కాను సీజ్ చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. కొడంగల్ పోలీస్ స్టేషన్‌లో నిందితుడు చంద్రకాంతి శరణప్ప, కొడంగల్ మండలం రావులపల్లి గ్రామంలోనూ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## మేడిగడ్డకు పెరిగిన వరద..

- ఉప్పొంగి ప్రవహిస్తున్న ప్రాణహిత

**వరంగల్, జూలై 19 (ప్రజాస్వరం) :** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మహదేవపూర్ మండల పరిధిలోని అంబట్‌పల్లి గ్రామంలో ఉన్న మేడిగడ్డ బరాజ్‌లో వరద ఉధృతి పెరిగుతోంది. కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఎగువన ఉన్న మహారాష్ట్రలోని ప్రాణహిత, గోదావరి నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో శుక్రవారం 16.17 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం కలిగిన మేడిగడ్డ బరాజ్‌కు 1,93,550 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. బరాజ్‌లోని మొత్తం 85 గేట్లు ఎత్తి అంతే మొత్తంలో నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. వరద తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని భారీ నీటి పారుదల శాఖ అధికారులు వెల్లడించారు. ఈ నేపథ్యంలో లోతట్టు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## చిరు ఉద్యోగుల వెతలు కనిపించడం లేదా..?

- మాజీ మంత్రి హరీష్‌రావు



**మెదక్, జూలై 19 (ప్రజాస్వరం) :** చిరు ఉద్యోగుల వెతలు కనిపించడం లేదా ? అంటూ రేవంత్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని సిద్దిపేట ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు ప్రశ్నించారు. వసతిగృహాల్లో ఔట్ సోర్సింగ్ విధానంలో పని చేస్తున్న తమకు జనవరి నుంచి జూలై వరకు వేతనాలు రావడం లేదని హరీశరావుకు ఉద్యోగులు మొరపెట్టుకున్నారు. ఈ మేరకు ఎక్స్ (ట్విట్టర్) వేదికగా స్పందించారు. ప్రభుత్వ ఎస్సీ, బీసీ వసతి గృహాల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ సిబ్బంది ఏడు నెలలుగా జీతాలు పొందక అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇంటి అద్దెలు చెల్లించడం కూడా భారంగా మారిందని, పీఎఫ్ డబ్బులు సైతం జమచేయడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. ఒకటో తేదీన వేతనాలు చెల్లిస్తున్నట్లు తప్పుడు ప్రచారం చేసుకుంటున్న కాంగ్రెస్ సర్కారుకు ఈ చిరు ఉద్యోగుల వెతలు కనిపించడం లేదా? అంటూ నిలదీశారు. తక్షణమే ఔట్ సోర్సింగ్ సిబ్బంది సమస్యలకు పరిష్కారం చూపాలని, ఏడు నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలని బీఆర్ఎస్ పక్షాన ప్రభుత్వాన్ని డిమాండ్

## అలర్ట్ తెలంగాణకు భారీ వర్షసూచన

**రంగారెడ్డి, జూలై 19 (ప్రజాస్వరం) :** ఒడిశా, ఉత్తరాంధ్ర తీరాన్ని ఆనుకొని వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం శుక్రవారం వాయుగుండంగా మారిందని వాతావరణ కేంద్రం పేర్కొంది. ఒడిశా పూరీకి ఆగ్నేయంగా 70 కిలోమీటర్ల, ఏపీలోని కళింగపట్నం తూర్పు – ఈశాన్యంగా 240 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉందని పేర్కొంది. శనివారం తెల్లవారుజామున వాయువ్యదిశగా పయణించి.. పూరీ సమయంలో ఒడిశా తీరాన్ని దాటే అవకాశం ఉందని పేర్కొంది. ఆ తర్వాత ఒడిశా, ఛత్తీస్‌గఢ్ మీదుగా పశ్చిమ – వాయువ్య దిశగా కదిలి 24గంటల్లో క్రమంగా బలహీనపడుతుందని తెలిపింది. ఈ క్రమంలో రాగల రెండురోజుల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం జిల్లాల్లో అక్కడక్కడ అత్యంత భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ రెడ్ అలెర్ట్‌ను జారీ చేసింది. ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, జగిత్యాల, ఖమ్మం, వరంగల్, హన్మకొండ, జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్, నిజామాబాద్, ఆదిలాబాద్, రాజన్న సిరిసిల్ల, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, కామారెడ్డి జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది.

# ప్రజాస్వరం
PRAJASWARAM తెలుగు దినపత్రిక

Bullet Edition

శనివారం, 19 జూలై 2024 www.prajaaswaramdaily.com 2PM


## తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో ఎదురుకాల్పులు



### పలువురు మావోయిస్టులు మృతి

హైదరాబాద్, జూలై 19 (ప్రజాస్వరం) : తెలంగాణ–ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో మరోసారి ఎదురు కాల్పులు కలకలం రేపాయి. భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య కాల్పులు కొనసాగుతున్నాయి. ఎదురుకాల్పుల్లో కొందరు మావోయిస్టులు మృతి చెందినట్లు తెలుస్తోంది. భారీగా ఆయుధ సామాగ్రిని భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## బిల్లు కట్టమన్నందుకు విద్యుత్ సిబ్బందిపై దాడి

హైదరాబాద్, జూలై 19 (ప్రజాస్వరం) : విద్యుత్ బకాయిలు చెల్లించాలని వచ్చిన సిబ్బంది మీద యువకుడు దాడి చేసిన ఘటన హైదరాబాద్–సనత్ నగర్లో జరిగింది. విద్యుత్ బకాయిలు రూ. 6,858 చెల్లించాలని సాయి గణేష్ అనే విద్యుత్ సిబ్బంది ఇంటి యజమాని రాములుని అడిగాడు. బిల్లు కట్టడానికి యజమాని నిరాకరించడంతో.. విద్యుత్ సిబ్బంది కరెంటు కట్ చేశారు. దీంతో యజమాని కుమారుడు కిక్ బాక్సర్ అయిన మురళీదర్ రావు(19) విద్యుత్ సిబ్బందిపై దాడి చేసి పిడి గుద్దులు కురిపించాడు.





# వాన గండం..!

## తెలుగు రాష్ట్రాలకు వాతావరణశాఖ అలర్ట్

**బంగాళాఖాతంలో అల్పపీడనం**

**ఏపీ ముంచెత్తుతున్న వర్షాలు**

**పొంగిపొర్లుతున్న వాగులు వంకలు**

**దవలేశ్వరం వద్ద గోదావరి ఉధ్రుతి**

**తెలంగాణలో పది జిల్లాలకు హెచ్చరిక**

**నేడు, రేపు అప్రమత్తంగా ఉండాలని సూచన**

**హైదరాబాద్, జూలై 19 (ప్రజాస్వరం)**

తెలుగు రాష్ట్రాలకు వాన ముప్పు భయపెడుతున్నది. బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడడంతో రానున్న 12 గంటల్లో ఇది వాయుగుండంగా మారే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఏపీలోని పలు ప్రాంతాల్లో గురువారం నుంచే భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. శుక్రవారం రాజమహేంద్రవరం వద్ద గోదావరి ఉద్ధృతి పెరిగింది. ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ వద్ద నీటిమట్టం 10.8 అడుగులకు చేరుకుంది. దీంతో సముద్రంలోకి 3.50 లక్షల క్యూసెక్కులకు పైగా నీటిని విడుదల చేస్తున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని రాజమహేంద్రవరం, రాజానగరం, అనపర్తి, మండపేట, కొత్తపేట, పి.గన్నవరం, అమలాపురం నియోజకవర్గాల్లో వర్షం కురుస్తోంది. దీంతో అక్కడి 7 వేల ఎకరాల్లోని పొలాలు నీటమునిగాయి. కోనసీమలోని రాజోలు, ముమ్మిడివరం నియోజకవర్గాల్లోనూ వర్షాలు కురుస్తున్నాయి.

అల్లూరి జిల్లాలో భారీ వర్షాలకు కొండ వాగులు పొంగుతున్నాయి. పాడేరు, జి.మాడుగుల, పెదబయలు, ముంచంగిపుట్టు మండలాల్లో రోడ్లు తెగిపోయాయి. అరకు నియోజకవర్గం వ్యాప్తంగా భారీవర్షాలు కురుస్తున్నాయి. అల్లూరి జిల్లాలో అన్ని విద్యాసంస్థలకు నేడు, రేపు సెలవు ప్రకటించారు. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట నియోజకవర్గంలో ఏకధాటిగా వర్షం కురుస్తోంది. జిల్లాలో విద్యాసంస్థలకు నేడు కలెక్టర్ సెలవు ప్రకటివంచారు. రైవాడ, కొనాం జలాశయాల్లోకి భారీగా వరద చేరుతోంది. కల్యాణపులోవ రిజర్వాయర్‌లోకి భారీగా వరద వచ్చి చేరుతోంది. గేట్లు ఎత్తి నీటిని సర్పా నదిలోకి విడుదల చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఏలూరు జిల్లాలోని మన్యం గ్రామాలు జలదిగ్బంధంలో ఉన్నాయి. దీంతో ఏజెన్సీ ప్రాంతాలకు రాకపోకలు నిలిచిపోయాయి. అలివేరు, జల్లేరు, బైనేరు వాగు, అశ్వారావుపేట, పడమటి వాగులు పొంగుతున్నాయి. సుమారు 20 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. పోలవరం ప్రాజెక్టు వద్ద గోదావరి నీటిమట్టం భారీగా పెరిగింది.

### తెలంగాణకు అలర్ట్..

తెలంగాణలోనూ నేడు, రేపు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ(ఐఎండీ) హెచ్చరించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు 'రెడ్ అలర్ట్' జారీ చేసింది. ములుగు, భద్రాద్రి–కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, కుమురంభీం–ఆసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, వరంగల్, హనుమకొండ, ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న–సిరిసిల్ల, జయశంకర్–భూపాలపల్లి తదితర జిల్లాలను అలర్ట్ చేశారు. ఆయా ప్రాంతాల్లో ఏకంగా 20 సెంటీమీటర్లకు పైగా వర్షం కురిసే అవకాశముందని అప్రమత్తం చేసింది. ఒకేసారి వరద ముంచుకురావడం, రోడ్లు, లోలెవల్ వంతెనలు మునిగిపోవడం, కొట్టుకుపోవడం, చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలిపోవడం జరగవచ్అని ఐఎండీ హెచ్చరించింది. కాగా, గురువారం భద్రాద్రి–కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలంలో 11.3 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. పలు జిల్లాల్లోనూ ఓ మోస్తరు వర్షాలు కురిశాయి.


మరోవైపు, తెలంగాణ వ్యాప్తంగా పలు జిల్లాల్లో చెరువులు, కుంటలు, వాగులు వర్షం నీటితో నిండు కుండలా తలపిస్తున్నాయి. తెలంగాణ నయాగరా పేరుగాంచిన ములుగులోని బోగత జలపాతాల వద్ద అత్యంత ప్రమాదకరంగా వరద ప్రవహిస్తోంది. మరోవైపు రాత్రి కురిసిన వర్షానికి కాగజ్‌నగర్ లోని ద్వారకా నగర్ లోతట్టు ప్రాంతాలు కావడంతో ఇండ్లలోకి వరద నీరు వచ్చి చేరింది. దీంతో అక్కడి ప్రజలు



## హుస్సేన్‌సాగర్‌కు భారీగా వరద!


### 513 అడుగులు దాటిన నీటి మట్టం

**హైదరాబాద్, జూలై 19 (ప్రజాస్వరం) : ఎడతెరిపి లేకుండా పడుతున్న వర్షానికి హైదరాబాద్‌లోని హుస్సేన్ సాగర్ నిండుకుండలా మారింది. రెండ్రోజులుగా కురుస్తున్న భారీ వర్షానికి హుస్సేన్ సాగర్‌లోకి భారీగా వర్షపు నీరు చేరుతోంది. ఈ క్రమంలోనే పరివాహక ప్రాంత ప్రజలకు అధికారులు సూచిస్తున్నారు. హుస్సేన్‌సాగర్ జలాశం పూర్తస్థాయి నీటి మట్టం 514 అడుగులు. ప్రస్తుతానికి నీటిమట్టం 513.21 అడుగులకు వరద నీరు చేరింది. మరోవైపు నీటి మట్టం పెరిగితే ఎలాంటి చర్యలు తీసుకోవాలనే అంశంపై జీహెచ్ఎంసీ అధికారులు పరిశీలన చేశారు.**



## పెద్దవాగు ప్రాజెక్టుకు గండి

**నీట మునిగిన వేలాది ఎకరాలు ◆ వరదలో కొట్టుకుపోయిన వందలాది పశువులు**



**హైదరాబాద్, జూలై 19 (ప్రజాస్వరం) :** భద్రాద్రి జిల్లా అశ్వారావుపేట మండలం గుమ్మడివల్లి సమీపంలో పెద్దవాగు ప్రాజెక్టుకు గురువారం రాత్రి భారీ గండి పడింది. వేలాది ఎకరాల్లో పంట దెబ్బతింది. పశువులు కొట్టుకుపోయాయి. పలు గ్రామాల ప్రజలు కొండలు, ఎత్తయిన భవనాల్లో రాత్రంతా తలదాచుకున్నారు. ఏం జరుగుతుందో తెలియక పరుగులు తీశారు. గురువారం రికార్డు స్థాయిలో 109.3 మిల్లీమీటర్ల వర్షపాతానికి.. ప్రాజెక్టు సామర్థ్యానికి మించి వరద నీరు వచ్చి చేరింది. మునుపెన్నడూ లేని విధంగా ప్రాజెక్టు ఆనకట్టలు మీదుగా వరద నీరు పొంగి ప్రవహించింది. ప్రాజెక్టు గేట్లు ఎత్తి వరద నీటిని నిరవధికంగా విడుదల చేస్తున్న ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో రాత్రికి ప్రాజెక్టు కుడి వైపు తుముకి భారీ గండిపడి ఆనకట్ట వరదలో కొట్టుకుపోయింది. దీంతో దిగువున ఉన్న వందలాది పొలాలన్నీ వాగులుగా మారగా.. పలు గ్రామాలు జలమయమయ్యాయి.

### భద్రాచలం వద్ద..

ఎగువ ప్రాంతాల నుంచి వరద చేరడంతో భద్రాచలం వద్ద గోదావరిలో నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. గురువారం 20 అడుగులు వద్ద ఉన్న వరద.. శుక్రవారం ఉదయం 9 గంటల సమయానికి 24.5 అడుగులకు చేరింది. గోదావరికి ఎగువ ప్రాంతంలో ఉన్న పేరూరులో ఉదయం 9 గంటలకు 40.86 అడుగులు నమోదైంది. ఇంద్రావతి, పేరూరు వైపు నుంచి వరద భద్రాచలం గుండా ప్రవహిస్తోంది. ఈ నేపథ్యంలో భద్రాచలంలో ప్రమాద స్థాయికి వరద చేరుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. గోదావరి పరీవాహక ప్రాంతంలో వర్షం కురవడంతో వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి. అప్రమత్తంగా ఉండాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.

## సీఎం రేవంత్ అమెరికా పర్యటన ఖరారు



హైదరాబాద్, జూలై 19 (ప్రజాస్వరం) : సీఎం రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటన ఖరారైంది. ఆగస్టు 3న రాత్రి రేవంత్ రెడ్డి బృందం అమెరికా బయల్దేరనుంది. ఈ పర్యటనలో భాగంగా పలు కంపెనీల సీఈవోలు, పారిశ్రామికవేత్తలను సీఎం కలవనున్నారు. వారితో చర్చించి రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురానున్నారు. డల్లాస్ తదితర రాష్ట్రాల్లో ఈ పర్యటన సాగనుంది. ఆగస్టు 11న రేవంత్‌రెడ్డి అమెరికా నుంచి

## ఏ ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేయాలి

### బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

హైదరాబాద్, జూలై 19 (ప్రజాస్వరం) : రాష్ట్ర ప్రజలను, రైతులు సీఎం, మంత్రులు రైతులను మాయ చేస్తున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. తెలంగాణ భవన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు అంతా మేమే చేశాం.. కేసీఆర్ హయాంలో ఏం జరగలేదన్నట్టుగా మాట్లాడుతున్నారని సీరియస్ అయ్యారు. కాంగ్రెస్ వాళ్ళ అబద్దాలు చూసి గోబెల్స్ బతికి ఉంటె ఆత్మహత్య చేసుకునే వారన్నారు. ఈ ప్రభుత్వం రైతుల రుణ మాఫీ కోసం విడుదల చేసింది రూ.6 వేల కోట్ల రూపాయలు మాత్రమే అన్నారు. ఇది రుణాలున్న రైతుల్లో 30 శాతం.. డబ్బుల పరంగా చూస్తే 20 శాతం మాత్రమే అన్నారు. రైతులకు కాంగ్రెస్ గోరంత చేసి కొండంతగా గొప్పలు చెప్పుకుంటోందన్నారు.

కేసీఆర్ హయాంలో మొదటి విడతలో 35 లక్షల మంది రైతులకు రూ.17 వేల కోట్ల రూపాయలు రుణ మాఫీ కింద చెల్లించామన్నారు. రెండో విడతలో రూ.19 వేల కోట్ల రూపాయలు రుణ మాఫీకి సిద్ధంగా ఉంచుకుని 12 వేల కోట్లు చెల్లించామన్నారు. ఇంకా ఏడు వేల కోట్లు కాంగ్రెస్ ఈసీకి చేసిన



ఫిర్యాదుతో చెల్లించకుండా మిగిలి పోయాయన్నారు. ఆ ఏడు వేల కోట్లు మంత్రుల కాంట్రాక్టు సంస్థలకు వెళ్లాయన్నారు. లక్ష లోపు రుణాల మొత్తం కేసీఆర్ హయాంలో రూ.19 వేల కోట్లు ఉంటే ఇప్పుడు రూ.6 వేల కోట్లకు ఎలా తగ్గిందని ప్రశ్నించారు. ఎవర్ని మోసం చేస్తున్నారని ఫైర్ అయ్యారు. ఆంక్షల పేరిట రైతుల రుణ మాఫీని కొందరికే కాంగ్రెస్ సర్కారు పరిమితం చేసిందన్నారు. కేసీఆర్ హయాంలో రైతుల అకౌంట్లలోకి పదేళ్లలో లక్ష కోట్ల రూపాయలు చేరాయని.. రూ.70 వేల కోట్లు రైతు బంధు కింద కేసీఆర్ రైతులకిచ్చారన్నారు. రూ.30 వేల కోట్ల రూపాయలు రుణ మాఫీ కింద ఇచ్చారని.. రూ.7 వేల కోట్లు లక్షా 20 వేల మంది రైతుల కుటుంబాలకు బీమా కింద చెల్లించారన్నారు. 3 కోట్ల టన్నుల ధాన్యాన్ని కేసీఆర్ హయాంలో రైతులు పండించారన్నారు. కాంగ్రెస్ సర్కారు రావడంతో రాష్ట్రంలో ఆత్మహత్యలు పెరిగాయన్నారు. రుణమాఫీని ఏ ఆంక్షలు లేకండా సీఎం రేవంత్ రెడ్డి అమలు చేయాలని డిమాండ్ చేశారు.

## హరీశ్ అడిగితేనే టైం ఇచ్చా..

### స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్



హైదరాబాద్, జూలై 19 (ప్రజాస్వరం) : ప్రతిపక్ష నాయకుడు కేసీఆర్ అసెంబ్లీకి హాజరు కావాలని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పేర్కొన్నారు. ఓ న్యూస్ చానెల్ కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడిన స్పీకర్.. 10 ఏళ్లు ఈ తెలంగాణను పరిపాలించిన కేసీఆర్ సంపూర్ణమైన రాజకీయ అనుభవం కలిగిన వ్యక్తి అని వారు వస్తే నేను సంతోషిస్తానన్నారు. కేసీఆర్ సభకు వచ్చి తన సూచనలు చేస్తే స్వీకరించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నోసార్లు చెప్పారని గుర్తు చేశారని తాను కూడా మనస్ఫూర్తిగా కేసీఆర్ సభకు రావాలని ఆహ్వానిస్తున్నానన్నారు. కేటీఆర్ తో ఉన్న స్నేహం వల్ల బీఆర్ఎస్ నేతలకు అపాయింట్ మెంట్ ఇచ్చి బీజేపీ వాళ్లకు ఇవ్వలేదనే విమర్శలను స్పీకర్ ఖండించారు. ఇది అవాస్తవం అన్నారు. తనకు ఫోన్ చేసింది కేటీఆర్ కాదని హరీశ్ రావు ఫోన్ చేసి రిప్రజెంటేషన్ ఇస్తామని కోరారన్నారు. బీఆర్ఎస్ లో కేసీఆర్ తర్వాత హరీశ్ రావు కీలక నేత అని సంచలన వ్యాఖ్యలు చేశారు.